
# ఈ వారం కథ

"భవాన్ పీఠాధిపతిః స్వప్నేపి విస్మృతిర్మాస్తు" కాషాయరంగు వృద్ధ బ్రాహ్మణ దేహం గర్జించింది.


"విను పరిపూర్ణానందా శ్రద్ధగా
విను సర్వేంద్రియాలతో
విను యీ రోజు నుండి
నువ్వొక పీఠాధిపతివి
వేదమంత్రాల మధ్య
పూర్ణ కలశాల మధ్య
అగ్నిహోత్రాల మధ్య
సత్‌బ్రాహ్మణుల మధ్య శాస్త్రోక్తంగా
నువ్వీ పీఠాధిపతివయ్యావ్
గుర్తుంచుకో యీ కలి
కాలం మననేమీ
చేయలేదు మనం దైవ
స్వరూపులం సర్వజ్ఞులం
యిక్కడే జీవిస్తున్నా
యీ లౌకిక వ్యవహా



AKBAR

రాలకి అతీతులం ఉపనిషత్
మంత్రాన్ని గుర్తుంచుకో
అహం బ్రహ్మాస్మి"

# పీఠాధిపతులు



రాణీ శివశంకర శర్మ




# ప్రేమనస్సమాధి

వెంటాడ బోయాను గానీ,
వేటాడబడ్డాను నేను!
లేడికళ్ళ పులికూన కదా... ఆమె!

నా సమాధిని చీల్చుకుని
గులాబీగా వికసించింది– నా హృదయం!
ఆమె జడలు తురుముకుంటే
విలువెల్లా పులకించిపోయాను

ఈ చలి... విరహమై వణికిస్తుంటే,
కమ్ముకున్న చీకటే... ఆమె కేశజాలమనే
భ్రమలోనే– స్వాంతన పొందాను నేను.

–ఛాయామల్లిక్

సర్వజ్ఞానంద స్వామి పాదాలపైన కొత్తగా పీఠాధిపత్యం స్వీకరించిన పరిపూర్ణానందస్వామి వాలిపోయాడు–మీ పాదాల సాక్షిగా యీ ప్రణవ పీఠ పూర్వాచార్యుల సాక్షిగా నేనీ ఆశ్రమ ప్రతిష్ఠని నిలువుతాను.

* * * *

"అనాచారీ యేం నిలిపావురా ఆశ్రమ ప్రతిష్ఠని" పూర్వాచార పరాయణ మైన పవిత్రాశ్రమంలో గద్గదంగా గంభీరంగా ముసలి గొంతు గర్జించింది. పీఠాధిపత్యభారాన్ని పరిపూర్ణా నందకి అప్పజెప్పి సర్వజ్ఞానంద పాదయాత్రకి బయలుదేరాడు యీ మాయా ప్రపంచంలో ఆ పాదయాత్రవొక మహాటన. జనం కనుచూపు మేరవరకే నడక, తర్వాత ఏసి కారులో దూరడం, పూరూరా ఖరీదైన పాదపూజలు, వెంట పెద్ద వైద్యులు దాన్ని బికారి బైరాగుల గాలి తిరుగుడుతో పోల్చలేం.

యీ పాదయాత్రలోనే పేపర్లో వార్తకి స్వామివారికి దిమ్మ తిరిగి పోయింది. దేవీ జననీ అపచారం క్షమస్వ అని దేవ భాషలో డైరెక్టుగా కన్నీళ్లతో అపాలజీ చెప్పారు. స్వామివారు పాదయాత్రని మధ్యలోనే ముగించి శరవేగంతో ఆశ్రమానికి తిరిగి వచ్చేశారు.

గురువుగారి హఠాత్ దాడికి అవాక్కయి పోయాడు పరిపూర్ణానందస్వామి ఆశ్రమ పరివారం మధ్య తన కోసం వచ్చిన వొక మత సంస్థ పెద్దల మధ్య తలతీసేసినట్లయింది ఆయనకి – పరమ హంస పరివ్రాజకాచార్య కస్మిన్ విషయేభవతాం ఆగ్రహః వినయంగా తలదించుకొని ప్రశ్నించాడు.

– ఛీ ఛీ ఛండాల గృహ ప్రవేశః సహస్రాధిక సంవత్సరాల నుండి బ్రహ్మ తేజస్సుతో వెలుగుతూన్న పవిత్రాశ్రమం అపవిత్రమైపోయింది" గద్గదమైన గొంతులోంచి బలహీన స్వరం "ఆదీవొక పీఠాధిపతి వలన"

"గురవర్యైః కిముచ్యతే నావగతం" పరిపూర్ణానంద

– యింకా నిద్ర నటిస్తున్నావా వొక బ్రాహ్మణ పంతులు దెబ్బలకి మాలపిల్ల కన్ను పోయిందట ప్రణవ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి సహాయం చేస్తానని వెళ్లారట హు. . . .

– మానవ మాధవ సేవయోః అభేదః

ముసలి స్వామి చప్పట్లు చరుస్తూ "అద్భుతం పరమాద్భుతం కర్మ సిద్ధాంతస్య సర్వనాశః వర్ణ సాంకర్యస్య ప్రబోధః వొక సత్యాన్ని గుర్తుంచుకో బ్రాహ్మణుడు పవిత్రుడు పుణ్యానికి ద్వారం పవిత్రమైనది అపవిత్రమైన దానిపై నిలిచి వుంటుంది. ఏ ప్రత్యేకత లేని వాళ్లు వున్నపుడే ప్రత్యేకత వుంటుంది. నిత్యం అవమానించబడే వాళ్లున్నప్పుడే బ్రహ్మరథంపై వూరేగుతూ గౌరవం పొందే వాళ్లూ వుంటారు" సర్వజ్ఞానంద శిష్యుడి కళ్లలోకి చూస్తూ "నీ పనుల అంతరార్థం నాకు తెలియటం లేదు పారంపర్యంగా వస్తున్న సంప్రదాయాల్ని గౌరవించి తలదించుకొని పోవడం ఆరోగ్యానికి మంచిది"

"గురువుగారూ మీరు చెప్పింది నిజమే కాని యీ కలికాలంలో శూన్యంలోంచి బూడిద తీసే శూద్రసన్యాసులు ప్రపంచమంతా చలామణీయైపోతున్నారు. విద్యారణ్యస్వామి వలె మనం కూడా రాజకీయాలలో వేలుపెట్టకపోతే మనవెవరూ పట్టించుకోరు"

"యీ ప్రపంచమొక పెద్దమాయ శిష్యా!"

– "అందులో యిదో చిన్న మాయ"

యీ మాయామయ ప్రపంచంలో గురువుకంటె శిష్యుడు 40 సంవత్సరాల అలస్యంగా అడుగు పెట్టాడు గురువు అంటరానితనాన్ని మారుశాతం పాటించే అగ్రహారంలో జన్మించి మరింత బ్రాహ్మణీకాన్ని కలగంటూ సన్యాసి అయ్యాడు కాని శిష్యుడు పరిపూర్ణానంద బాల్యం గాంధీ భావాలు అగ్రహారాన్ని కూడా తాకుతున్న కాలం.

యీ నాడు అభ్యుదయపు ముసుగులేనిదే బ్రాహ్మణీకం కోరలతో బైట పడిపోతుందన్న సత్యాన్ని గ్రహించిన జ్ఞాని పరిపూర్ణానంద. కాని అతనీ జ్ఞానాన్ని కుటిల బ్రాహ్మణ నీతి అని చెండాడ్తూ సహాయం నిరాకరించారు

దళితులు – ఎప్పుడూ మీ పీఠాల దరిదాపులకైనా రానివ్వలేదు మీరు. మీ మొసలి కన్నీరు మాకు వద్దు అంటూ తిప్పికొట్టారు. యిప్పుడేమంటావన్నట్లు కళ్లల్లోకి సూటిగా చూపుల్ని గుచ్చింది ముసలి మాయ

– నేను పీఠాధిపతిని, సర్వజ్ఞుడిని, జగద్గురువుని, పరమాత్మ స్వరూపుణ్ణి, నేను చేసే ప్రతీ పనీ లోక కళ్యాణం కోసమే, గో బ్రాహ్మణ హితం కోసమే

వ్యంగ్యపు స్వరం – గొడ్డు మాంసం తినే వారి వుద్ధరణ కోసం పరిగెత్తి చీవాట్లు తినడం......యిదంతా గో బ్రాహ్మణ హితమేనా

– గురువుగారూ మీరు పీఠాధిపతి గౌరవాన్ని భంగపరుస్తూ మాట్లాడ్తున్నారు. తద్వారా ప్రణవ పీఠాన్నే అవమానిస్తున్నారు.

– నువ్వొక సాధారణ ప్రభుత్వోద్యోగి కొడుకువి నిన్నింతవాణ్ణి చేసింది నేను.

– అయోగ్యుడికి పీఠాన్ని అప్పజెప్పివుంటే, అది తమ అసమర్థతని అయోగ్యతనాన్ని సూచిస్తుంది నేను వేదశాస్త్రాలలోనే కాదు యీ ప్రపంచానికి కిటికీలాంటి ఆంగ్లంలో కూడా పండితుణ్ణి.

యీ చివరి మాట గుచ్చుకొని గురువు లఘువై గిలగిలలాడి – మ్లేచ్ఛ భాషాపాండిత్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించక్కర్లేదనుకుంటా.

ఆ గురు శిష్యుల మధ్య ఘర్షణ తీవ్రమైంది. వొక రోజు రాత్రి తన సన్యాస దండాన్ని ఆశ్రమంలోనే విడిచిపెట్టి పరిపూర్ణానంద చెప్పాపెట్టకుండా యెటో వెళ్ళిపోయాడు. అలా దండాన్ని విడిచిపెట్టిపోవడం వల్ల పీఠాధిపత్యపు అర్హతే పోతుందని ప్రత్యర్థిమతపు పండితులు ఆరోపించారు. యీ శాస్త్రాలు తమ బోటి దైవ స్వరూపుల విషయంలో చెల్లవని ముసలిస్వామి గర్జించాడు. ప్రత్యర్థి సన్యాసులూ పండితులూ యీ దెబ్బతో దారితప్పిన పీఠం కుప్పకూలిపోతుందని ఆశించారు. వైదిక ధర్మాన్ని మంట కలుపుతోందని విమర్శలు గుప్పించారు. ముసలి స్వామి వొంటరి వాడై కుంగిపోయాడు. కొడుకులా తీర్చిదిద్దిన తన ప్రతిరూపమే యిలా తిరగబడ్తే యేం చెయ్యగలడు.

స్వామి అలిగి వెళ్ళిపోవడంతో భక్తకోటికి చెందిన బ్రాహ్మణ రాజకీయ నాయకులు కూడా అలర్టైపోయారు గాలింపు. వొక సుదూర ప్రాంతపు ఆశ్రమంలో శిష్యుడు వున్నాడని తెలియగానే సర్వజ్ఞానందస్వామి వాయువేగంతో వెళ్ళి బతిమాలడం మొదలు పెట్టాడు.

"నువ్వు ఆశ్రమాన్ని వదిలిపెట్టగానే నేను వొంటరి వాణ్ణైపోయాను. కాటికి కాళ్ళు జాపిన ముసలి వాణ్ణి కఠోర బ్రహ్మచర్యంతో నాశక్తంతా యింకిపోయింది. పీఠ ప్రతిష్ఠతో నా ప్రాణం ముడిపడి పోయింది. సన్యాసులకి మమకారాలుండవంటారు. కాని వృద్ధస్తావత్ చింతాసక్తః అన్న శంకరాచార్యుల మాట నా విషయంలోనూ నిజమైంది నువ్వు దూరం కాగానే నేను....."

సర్వజ్ఞానంద కంఠం బొంగురు పోయింది కళ్లల్లో నీళ్ళు. కొన్ని క్షణాల తర్వాత కుంగిపోయిన స్వరంతో స్వామి మూలిగాడు. "గుర్తుంచుకో మఠం అంటే రాతి కట్టడం కాదు అది బ్రాహ్మణ ధర్మంపైన ధర్మశాస్త్రాల పైన నిలిచి వుంది అవే బలహీన పడిపోతే మొత్తం కుప్పకూలి దాని కింద పడి చచ్చిపోతాం గీతలో చెప్పినట్లు ఊర్థ్వమూలం అథఃశాఖం – పవిత్రమైన తలకిందులు చెట్టు మన పీఠం.

– గురువుగారూ నేనా చెట్టుకి ఎరువులు వేస్తున్నా

– శిష్యా ఈ కృత్రిమ ఎరువులు అసలుకే ముప్పు తెస్తాయని నా భయం.

– బ్రహ్మ స్వరూపా గురువర్యా బౌద్ధుల వర్ణసాంకర్య సమానత్వాన్ని కాదన్న శంకరాచార్యుల వారే బౌద్ధతర్కాన్ని సిద్ధాంతాన్ని బ్రాహ్మణ భావజాలానికి అనుగుణంగా మలుచుకొన్నారు. అవసరమైతే సామ్యవాదానికి కూడా కాషాయపు ముడి వెయ్యాలి. సముద్రంలా మనం అన్నింటినీ వాతాపి జీర్ణం చేసుకోపోతే కాలం మనని తుడిచి పెట్టేస్తుంది నదీనాం సాగరో గతిః"

సంధి కుదిరి పీఠానికి తిరిగి వచ్చాడు శిష్యుడు పరిపూర్ణానంద.

మర్నాడు అమెరికాలో సైంటిస్టుగా పనిచేస్తున్న యువకుడు వచ్చి సర్వజ్ఞానంద స్వామివారి పాదాలకి సాష్టాంగపడి వొక ధర్మ సందేహం వ్యక్తం చేశాడు. స్వామీ సంధ్యావందన సంకల్పం జంబూద్వీపే భరత వర్షే భరతఖండే అని చెప్తాం కదా అమెరికాలో యెలా చెప్పాలి.

– అక్కడ సంధ్యావందనమూ యితర బ్రాహ్మణ సంప్రదాయాలూ పాటిస్తారా స్వామి ప్రశ్న.

– యిక్కడి కంటె బాగా ఆచరిస్తారు. అమెరికా బ్రాహ్మణ సంఘం కూడా వుంది. పూజల కేసెట్లు హాట్ కేక్స్‌లా అమ్ముడుపోతాయి. ఆ యువకుడి మాటలు మైకేల్‌జాక్సన్ వేదమంత్రాలు వల్లించినట్లు చెవులకింపుగా వున్నాయి.

– స్వామీ నేను చేసిన వొక తప్పని విన్నవించుకొంటున్నాను. నేనొక అమెరికా అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నాను. ఆమెకి భారతీయ సంస్కృతి అంటే చచ్చేంత యిష్టం కట్టూబొట్టూ అంతా వెలనాట్లలాగే వుంటుంది. భరతనాట్యం కూడా నేర్చుకొంది. యింతకీ సంధ్య వార్చేందుకు జందెం వేసుకొనేందుకు నాకు అర్హత వుందా ఈ విషయంలో ధర్మశాస్త్రాలు యేమని సెలవిచ్చాయి? వొక్కసారిగా ముసలిస్వామి మౌనంలోంచి ధ్యానంలోకి జారుకొన్నారు.

బాధగా పాదాల మీద వాలిపోయిన ఆపాశ్చాత్య బ్రాహ్మడి బాధ విని చిన్నస్వామి పరిపూర్ణానంద ప్రేమగా భుజం తట్టి వుపశమన వాక్యాలు పలికాడు – "నిన్నని కుక్క ముట్టుకోలేదు బ్రాహ్మణోస్య ముఖమాసీత్ యేదేశమేగినా యెందుకాలిడినా బ్రహ్మముఖం నుంచి వుట్టావన్న సంగతి మరచిపోనంత కాలం సత్ బ్రాహ్మణుడివి పవిత్రుడివి" ఆ యువకుడిపై దర్భలతో నీళ్ళు జల్లాడు, గాయత్రీ మంత్రం స్వయంగా వుపదేశించాడు. ఆ యువకుడు వెళ్తూ పీఠానికి లక్ష రూపాయలు విరాళమిచ్చి వెళ్ళాడు.

వొక సామ్యవాది పరిపూర్ణానందస్వామి దర్శనానికి వచ్చాడు. సోవియట్ యూనియన్ పతనాంతరం అతనిలో వచ్చిన మార్పు నుదుట విభూతిబొ


ఆటోమేటిక్ టాయ్ రివాల్వర్



SUN ZORO
Rs.150/-
పోస్టల్ ఛార్జీలు అదనం


100 షాట్లు
ఉచితం


GUN ZORO
Rs. 250/-
పోస్టల్ ఛార్జీలు అదనం


★ లైసెన్స్ అవసరం లేదు
★ పిల్లలకు అపూర్వమైన బహుమతి
★ మహిళలకు ఆత్మరక్షణ కొరకు


సన్‌జోరో మరియు గన్‌జోరో తుపాకులు మీకు పూర్తి రక్షణనిస్తాయి. పిక్‌నిక్‌ల కొరకు, డ్రామాలలో, షూటింగ్‌లకు ప్రయాణాలలో మరియు జంతువుల బారి నుండి రక్షించుకొనుటకు పొగలు విరజిమ్ముతూ ప్రేలే తుపాకి. వెంటనే మీ ఆర్డర్లను పంపించండి.

PRAGATHI TRADERS (A/4)
(PO) MAIRA BARITH (GAYA)




ట్లుగా కొట్టవచ్చినట్లుంది. స్వామి ఉవాచ – సర్వం బ్రహ్మమయం యీ దేశంలో ప్రతి సంస్కరణనీ, విప్లవాన్నీ, మార్పునీ విఘ్నేశ్వర పూజతో ప్రారంభించేది బ్రాహ్మణుడే జాతీయ భావమూ భారతీయ సంస్కృతీ అన్నీ అతని పాద ధూళిలోనే లభిస్తాయి.

– "ఔను స్వామీ మా ముక్తి మీ పాద ధూళీలోనే"

* * * *

విఘ్నేశ్వరుడు గడగడ పాలు తాగేశాడు పరిపూర్ణానందస్వామి దేశంలో హిందూ రాజ్యం ఏర్పడాలని తమ సంస్కృతి సంప్రదాయాల్ని అనుసరించడమే దేశభక్తి అని బోధించడం మొదలుపెట్టాడు. దేశవిదేశాలలో అగ్రవర్ణ భక్తుల సంఖ్య పెరిగింది. వారి విరాళాలు పెరిగాయి. మఠంలో గురువుకి సువర్ణాభిషేకం వైభవంగా జరిగింది ఆ ఆనంద సముద్రంలో కొట్టుకుపోయి కళ్ళు తేలేసి పరమాత్మలో లీనమయ్యారు సర్వజ్ఞానందస్వామి

పరిపూర్ణానంద వేదాల్ని కంప్యూటరీకరిస్తున్న ఒక ప్రవాస భారతీయుడి కొడుకుని శిష్యుడిగా స్వీకరించాడు అమెరికాలో పెరగడం వల్ల తమ కొడుకు బాల్యచాపల్యాల్ని ఉపేక్షించాలని, జైలులోలా. మరీ నిర్బంధిస్తే ప్రమాదమని తల్లిదండ్రులు షరతుపెట్టారు.

– చూడండి యిన్ని సంవత్సరాల ఆశ్రమ జీవితం తర్వాత కూడా రాగద్వేషాలని యింద్రియ సుఖాలనీ విడిచిపెట్టడం నాకే సాధ్యం కావడం లేదు అంతా వైష్ణవ మాయ నన్ను మా గురువు పెంచిన దానికంటే మిన్నగా మీ అబ్బాయి అభిరుచుల్ని కూడా గుర్తిస్తూ తండ్రిలా పెంచి పెద్ద చేస్తాను పెరిగి పెద్దయ్యాక స్వయంగా మంచి చెడులు తెలుసుకొని పరిబ్రహ్మపథంలో ప్రయాణిస్తాడు" అని నచ్చజెప్పాడు స్వామి.

* * * *

– శిష్యా నిత్యానందా టీవీలో నీ ఉపన్యాసాలూ, నీ విద్యాభ్యాసమూ అంతా బాగానే వున్నాయి కానీ.....

– ఏమైంది గురువుగారూ

– నువ్వు పెద్దయ్యే కొద్దీ క్రమేపీ అన్నీ సద్దుమణుగుతాయనుకొన్నాను కాని నీలో మార్పులేదు.

శిష్యుడు చిద్విలాసంగా నవ్వుతూ – ఆనందో బ్రహ్మ అందువల్లనే మైకేల్ జాక్సన్‌కి బొట్టుపెట్టి పూర్ణకుంభంతో స్వాగతం యేసంగీతమైనా నాదబ్రహ్మమే యే ఆనందమైనా బ్రహ్మస్వరూపమే

– హు.....తాగి వూగడం కూడానా?

– పీత్వా పీత్వా పునః పీత్వా....... తంత్రశాస్త్రం ప్రకారం తాగి తాగి నేల మీదపడి దొర్లేవాడే భూసురుడు, యోగి, యోని పూజ గురించి మీ అభిప్రాయం?" గురువుకి గుండెదడ, ముక్కు మీద వేలు.

"పరమాచార్యా అహం భావి పీఠాధిపతిః నన్ను పామరుడిలా చూసి అవమానించకండి భగవంతుడికి మంత్రమూ తంత్రమూ రెండు కళ్ళు యీ ఆధునిక యుగంలో మంత్రతంత్రశాస్త్రాల సమ్మేళనంతో ఆకర్షణీయమైన కొత్త ధర్మాన్ని సృష్టిస్తున్నాను". ◆